

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం · తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA · RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 02.02.2026 | సంపుటి : 3 | సంచిక :2 | పేజీలు : 8 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI · Monday · 02.02.2026 · volume : 3 · Issue : 2 · Pages : 8 · Cost : 2/-

విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

## 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్

# ₹53.5 లక్షల కోట్లు

మూలధన వ్యయాన్ని రూ.12.2 లక్షల కోట్లకు పెంచిన కేంద్ర ప్రభుత్వం

బయోఫార్మా, ఎంఎస్ఎంఈ రంగాలకు చెరో రూ.10,000 కోట్ల నిధులు

వ్యక్తిగత అవసరాల దిగుమతులపై కస్టమ్స్ సుంకం 10 శాతానికి తగ్గింపు

ఏప్రిల్ 2026 నుంచి అమల్లోకి రానున్న కొత్త ఆదాయపు పన్ను చట్టం

02



సామాన్యుడికి కొంత మోదం.. స్టాక్ మార్కెట్లకు, మదుపర్లకు ఖేదం.. స్టార్టప్‌లకు కాస్త నిరాశ.. పన్ను చెల్లింపుదారులకు అసంతృప్తి.. విదేశీ పెట్టుబడిదారులకు శుభవార్త.. తయారీరంగం వారికి ఊరట.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన బడ్జెట్ క్రికెట్ మ్యాచ్ చూశాక.. వివిధ వర్గాల అనుభూతులివి. 2026--27 సంవత్సరానికిగానూ రూ.53.47 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌ను నిర్మల ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ ఏడాది పశ్చిమ బెంగాల్, తమిళనాడు సహా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నప్పటికీ, ప్రజాకర్షక హామీలకు దూరంగా బడ్జెట్‌ను రూపొందించారు. విత్త మంత్రి తన బడ్జెట్‌లో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అనేక చర్యలు ప్రకటించారు.



## కేంద్ర బడ్జెట్ ఎఫెక్ట్:

# ధరలు పెరిగేవి, తగ్గేవి

02

కొన్ని రకాల ఔషధాలు, ఈవీ బ్యాటరీలు, మొబైల్స్, ట్యాబ్లెట్స్ ధరల్లో తగ్గుదల

విదేశీ విద్య, వైద్యపరికరాలపై తగ్గనున్న భారం

పెరగనున్న సిగరెట్, లగ్జరీ వాచ్ లు, విదేశీ మద్యం ధరలు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన తొలి మహిళా ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ నిలిచారు. దేశీయ ఉత్పత్తులకు మద్దతు ఇచ్చేలా, దిగుమతులను నియంత్రించేలా, అదే సమయంలో డిమాండ్ పెంచేలా ఈ బడ్జెట్‌లో చర్యలు ప్రకటించారు. బడ్జెట్ ప్రభావంతో కొన్ని రకాల వస్తువుల ధరలు పెరగనుండగా, మరికొన్నింటి ధరలు తగ్గనున్నాయి.

## ఏప్రిల్ 1 నుంచి నూతన

# ఆదాయపు పన్ను చట్టం

02

ఆదాయపు పన్ను ఫారాలు సరళతరం చేసినట్లు వెల్లడి

విదేశీ యాత్రలు, విద్య, వైద్యంపై పన్ను, టీడీఎస్ తగ్గిస్తున్నట్లు తెలిపిన ఆర్థిక మంత్రి

విదేశీ ఆస్తుల వివరాలు వెల్లడించడం తప్పనిసరి అన్న నిర్మలా సీతారామన్




# ముగిసిన కేసీఆర్ సిట్ విచారణ

కేసీఆర్ ను 4 గంటల 50 నిమిషాల పాటు ప్రశ్నించిన సిట్ అధికారులు

కేసీఆర్ వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో రికార్డ్ చేసిన అధికారులు

నిందితుల వాంగ్మూలాల ఆధారంగా సాగిన దర్యాప్తు



హైదరాబాద్, ఫిబ్రవరి 1 : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విచారణ ముగిసింది. ఆదివారం నందినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), కేసీఆర్‌ను దాదాపు 4 గంటల 50 నిమిషాల పాటు విచారించింది. విచారణ అనంతరం ఆయన వాంగ్మూలాన్ని

మిగతా 2 లో

## కేంద్ర పన్నుల్లో తెలంగాణ వాటా

# ₹33,180 కోట్లు

పెరిగిన పన్నులు రూ.3,281.01 కోట్లు

హైదరాబాద్ మీదుగా మూడు హైస్పీడ్ రైల్వే కారిడార్లు

సింగరేణికి రూ.2,500 కోట్లు కేటాయించిన కేంద్రం

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు సంబంధించిన నిధుల కేటాయింపులు, పన్నుల వాటా వివరాలు వెల్లడయ్యాయి. కేంద్ర పన్నుల నుంచి రాష్ట్రానికి వచ్చే వాటాలో స్వల్ప పెరుగుదల కనిపించగా, మౌలిక వసతుల కల్పనలో భాగంగా హైదరాబాద్‌కు మూడు హైస్పీడ్ రైల్వే కారిడార్లను ప్రతిపాదించడం గమనార్హం. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్రం వసూలు చేసే పన్నుల్లో రాష్ట్రాలకు పంచే వాటా కింద ఈసారి తెలంగాణకు 2.174 శాతం ఖరారైంది.



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దీని ప్రకారం 2026-27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి మొత్తం రూ.33,180.78 కోట్లు రానున్నాయి. ఇందులో కార్పొరేషన్ పన్ను రూ.9,740.28 కోట్లు, ఆదాయపు పన్ను రూ.11,808.15 కోట్లు, కేంద్ర జీఎస్టీ (సీజీఎస్టీ) రూ.9,074.92 కోట్లు, కస్టమ్స్ సుంకం రూ.1,770.30 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ రూ.754.15 కోట్లు, ఇతర ట్యాక్స్‌లు రూ.32.98 కోట్లు ఉన్నాయి. కాగా గత బడ్జెట్‌లో కేంద్రం పన్నుల రూపంలో తెలంగాణకు

మిగతా 2 లో



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 130 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 157 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 228 (కిలో) |
| స్కిన్ లెస్ | 259 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹72

# బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

ఎంపీలంతా కేంద్రంపై ఒత్తిడి పెంచాలి: భట్టి

ఏం పాపం చేసిందని హైదరాబాద్‌ను పట్టించుకోలేదు?

హైదరాబాద్, ఫిబ్రవరి 1: కేంద్ర బడ్జెట్‌పై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో కేంద్రానికి తెలంగాణ గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ప్రపంచంతో పోటీ పడే స్థాయిలో అన్ని రంగాల్లో అనుకూలతలు కలిగి ఉన్న హైదరాబాద్ ఏం పాపం చేసిందని పట్టించుకోలేదని నిలదీశారు. ఆదివారం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపులు ఉంటాయని ఆశించాం..కానీ నిర్మలా సీతారామన్

మిగతా 2 లో



# హైదరాబాద్ నుంచి హై స్పీడు రైల్ కారిడార్లు

ముంబైకి 3 గంటలు చెన్నైకి 3 గంటలు బెంగళూరుకు 2 గంటలు

హైదరాబాద్ నుంచి మూడో వంతుకుపైగా తగ్గనున్న ప్రయాణ సమయం

సాకారం కానున్న హైదరాబాద్ -ముంబై, చెన్నై, బెంగుళూరు కారిడార్లు

ఇప్పటికే డీపీఆర్ పూర్తి చేసుకున్న హైదరాబాద్ -ముంబై ప్రాజెక్టు రెండుగా విభజన

10





## కేంద్ర పన్నుల్లో తెలంగాణ వాటా
# రూ.33,180 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

రూ.29,899.77 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. గతేడాదితో పోలిస్తే రాష్ట్రానికి వస్తున్న పన్నుల నిధులు రూ.3,281.01 కోట్లు అధికం. దేశవ్యాప్తంగా నగరాల మధ్య వేగవంతమైన ప్రయాణం కోసం కేంద్రం ప్రతిపాదించిన 7 హైస్పీడ్ రైల్వే కారిడార్లలో మూడు కారిడార్లు హైదరాబాద్‌ను అనుసంధానించనున్నాయి. ఇది రాష్ట్ర రవాణా రంగానికి ఊతమిచ్చే అంశం. ఈ కారిడార్లలో పుణే--హైదరాబాద్, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--చెన్నైలు ఉన్నాయి.

### పైలట్ ప్రాజెక్టుగా తెలంగాణ

కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల బదిలీలో పారదర్శకత కోసం తీసుకొచ్చిన 'ఎస్ఎన్ఏ దేశవ్యాప్తంగా అమలు చేయడానికి ముందు.. కేవలం ఆరు రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టారు. అందులో తెలంగాణ చోటు దక్కించుకుంది. జీఎస్టీ అమలు వల్ల రాష్ట్రాలకు జరిగిన ఆదాయ నష్టాన్ని పూడ్చేందుకు, గతంలో కేంద్రం 'బ్యాక్ టు బ్యాక్ లోన్'పద్ధతిలో నిధులు విడుదల చేసింది. దీని కింద తెలంగాణకు 2020--21, 2021--22 ఆర్థిక సంవత్సరాల్లో కలిపి మొత్తం రూ.6,949.49 కోట్లు విడుదలైనట్టు తాజా బడ్జెట్ పత్రాలు స్పష్టం చేశాయి.

### రాష్ట్రంలోని కేంద్ర సంస్థలకు కేటాయింపులు ఇవే

ఈ బడ్జెట్‌లో ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజనలో భాగంగా తెలంగాణలోని బీబీనగర్ ఎయిమ్స్ సహా ఇతర ఎయిమ్స్‌లు అన్నింటికి కలిపి రూ.2,005 కోట్లు కేంద్రం కేటాయించింది. హైదరాబాద్ ఐఐటీ (ఎక్స్‌ట్రనల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులు)కు నిధుల కేటాయింపులో మొండి చేయి చూపించారు. కాగా తెలంగాణలోని గిరిజన యూనివర్సిటీ కోసం కేటాయింపులు ప్రత్యేకంగా చేయలేదు.

### సింగరేణికి పెరిగిన నిధుల కేటాయింపు

సింగరేణి కేలరీస్ సంస్థకు రూ.2,500 కోట్లు, హైదరాబాద్‌లోని అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ సంస్థకు రూ.405.97 కోట్లు, హైదరాబాద్ సహా దేశంలోని 7 నైపర్ సంస్థలకు కలిపి గత బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించి, రూ.281.07 కోట్లకు సవరించారు. అయితే ప్రస్తుత బడ్జెట్‌లో నిధుల కోత విధించి రూ.215 కోట్లు ఏడు నైపర్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. కాగా హైదరాబాద్‌లోని ఇన్‌కాయిస్‌కు రూ.30 కోట్లు, హైదరాబాద్ సహా మరో మూడు ప్రాంతాల్లో ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ హిందీ సంస్థకు రూ.26 కోట్లు, హైదరాబాద్ సహా 12 నగరాల్లో ఉన్న సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సీ--డాక్)కు రూ.280 కోట్లు, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డుకు రూ.14.55 కోట్లు, స్వాతంత్ర్య సమరయోధులకు, నిజాం సంస్థాన విలీనం కోసం పోరాడిన యోధులకు (పెన్షన్లు) రూ.589.97 కోట్లు, హైదరాబాద్ జాతీయ పోలీసు అకాడమీ సహా పోలీసు విద్య, ట్రైనింగ్, పరిశోధనలకు కేటాయింపుల్లో కోత విధించి రూ.908.78 కోట్లు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించారు. అయితే హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్‌కు కేటాయింపుల్లో కోత విధించారు. మూడేళ్ల క్రితం రూ.115 కోట్లు కేటాయించి, రెండేళ్ల క్రితం బడ్జెట్‌లో కేవలం రూ.10.84 కోట్లు మాత్రమే కేటాయించిన కేంద్ర ప్రభుత్వం....గత బడ్జెట్‌లో కేవలం నామమాత్రంగా రూ.0.01 కోట్లు కేటాయించింది. కాగా ప్రస్తుత బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్‌సీఐ) సహా దేశంలోని 25 స్వయంప్రతిపత్తి కేంద్రాలన్నింటికీ కలిపి రూ.1,643.87 కోట్లు, సీడీఎఫ్‌డీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎనిమల్ బయోటెక్నాలజీ సహా దేశంలోని ఇతర స్వయంప్రతిపత్తి సంస్థలకు కలిపి రూ.1,002.13 కోట్లు, మణుగూరు సహా కోటా (రాజస్తాన్)లోని భార జల ప్లాంట్లకు రూ.1,745.52 కోట్లు కేటాయించారు.



## ముగిసిన కేసీఆర్ సిట్ విచారణ

అధికారులు నమోదు చేసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన నిందితులు ఇచ్చిన సమాచారం, వాంగ్మూలాల ఆధారంగా సిట్ అధికారులు కేసీఆర్‌పై ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. మొత్తం విచారణ ప్రక్రియను సిట్ అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. విచారణ పూర్తయిన తర్వాత సిట్ బృందం కేసీఆర్ నివాసం నుంచి వెనుదిరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారులు, ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేశారన్న ఆరోపణలపై ఈ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే పలువురిని సిట్ విచారించింది. నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగానే మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ అధికారులు విచారించినట్టు తెలుస్తోంది.

## 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్
# రూ.53.5 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ:** కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. యు-ువశక్తిని చోదకశక్తిగా చేసుకుని, పేదలు, అణగారిన వర్గాల ప్రగతి లక్ష్యంగా ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆమె తెలిపారు. మొత్తం రూ.53.5 లక్షల కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ఈ బడ్జెట్‌లో స్థిరమైన ఆర్థిక వృద్ధి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' దార్శనికతతో అందరికీ సమాన అవకాశాలు కల్పించడం అనే మూడు ప్రధాన కర్తవ్యాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

### ప్రధాన కేటాయింపులు, ఆర్థిక అంచనాలు

2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వ్యయం రూ.53.5 లక్షల కోట్లుగా అంచనా వేయగా, మొత్తం రాబడులు (అప్పులు మినహా) రూ.36.5 లక్షల కోట్లుగా ఉంటాయని బడ్జెట్‌లో పేర్కొన్నారు. కేంద్ర నికర పన్ను రాబడులు రూ.28.7 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ద్రవ్యలోటును జీడీపీలో 4.3 శాతానికి పరిమితం చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2025-26 సవరించిన అంచనాల్లో ద్రవ్యలోటు 4.4 శాతంగా ఉంది. స్థూల మార్కెట్ రుణాలు రూ.17.2 లక్షల కోట్లుగా ఉంటాయని తెలిపారు.

### మౌలిక సదుపాయాలకు భారీ కేటాయింపులు

దేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో పెద్ద పీట వేసింది. ప్రభుత్వ మూలధన వ్యయాన్ని (పబ్లిక్ క్యాపెక్స్) గత ఏడాది రూ.11.2 లక్షల కోట్ల నుంచి ఈసారి రూ.12.2 లక్షల కోట్లకు పెంచుతున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ భారీ నిధులతో దేశవ్యాప్తంగా పలు కీలక ప్రాజెక్టులకు ఊతం లభించనుంది. ఇందులో భాగంగా పర్యావరణ అనుకూల ప్రయాణ వ్యవస్థలను ప్రోత్సహించేందుకు ఏడు హై-స్పీడ్ రైల్ కారిడార్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వీటిలో ముంబై-పుణె, పుణె-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై-



బెంగళూరు కారిడార్లు ఉన్నాయి. దీంతో పాటు తూర్పున దంకుని నుంచి పశ్చిమాన సూరత్ వరకు కొత్త ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లను ఏర్పాటు చేయనున్నారు. రాబోయే ఐదేళ్లలో 20 కొత్త జాతీయ జలమార్గాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

### రంగాల వారీగా నిధుల కేటాయింపు

ఈ బడ్జెట్‌లో పలు కీలక రంగాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.

**బయోఫార్మా:** బయోఫార్మా రంగంలో భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చే లక్ష్యంతో 'బయోఫార్మా శక్తి' పథకాన్ని ప్రకటించారు. దీనికోసం రాబోయే ఐదేళ్లలో రూ.10,000 కోట్లు కేటాయించారు.

**ఎంఎస్ఎంఈ:** సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి రూ.10,000 కోట్లతో 'ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్'ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

**ఎలక్ట్రానిక్స్:** ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీ పథకం కోసం కేటాయింపులను రూ.40,000 కోట్లకు పెంచారు.

**పరిశ్రమలు:** కంటైనర్ల తయారీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఐదేళ్ల కాలానికి రూ.10,000 కోట్లు కేటాయించారు.

**పర్యావరణం:** కార్బన్ క్యాప్చర్, యుటిలైజేషన్ అండ్ స్టోరేజ్ (సీసీయూఎస్) టెక్నాలజీల కోసం రాబోయే ఐదేళ్లలో రూ.20,000 కోట్లు కేటాయించారు.

**పట్టణాభివృద్ధి:** నగర ఆర్థిక ప్రాంతాల (సిటీ ఎకనామిక్ రీజియన్స్) అభివృద్ధి కోసం ఒక్కో ప్రాంతానికి ఐదేళ్లలో రూ.5,000 కోట్లు కేటాయించనున్నారు.

### పన్నులు, ఇతర ప్రతిపాదనలు

పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యం కల్పించేందుకు పలు సంస్కరణలు ప్రతిపాదించారు. ఏప్రిల్ 2026 నుంచి 'కొత్త ఆదాయపు పన్ను చట్టం, 2025' అమల్లోకి రానుంది. విదేశీ పర్యటన ప్యాకేజీలపై టీసీఎస్ రేటును 2 శాతానికి తగ్గించారు. వ్యక్తిగత వినియోగం కోసం దిగుమతి చేసుకునే వస్తువులపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని 20% నుంచి 10%కి తగ్గించడం ద్వారా సామాన్యులకు ఊరట కల్పించారు. క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే 17 రకాల మందులపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని మినహాయించారు. మరోవైపు, ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ)ని 0.02% నుంచి 0.05%కి పెంచారు. మొత్తం మీద ఈ బడ్జెట్, దీర్ఘకాలిక వృద్ధి, ఉపాధి కల్పన లక్ష్యంగా మౌలిక వసతులు, తయారీ రంగాలపై దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.

# ధరలు పెరిగేవి.. తగ్గేవి

(మొదటిపేజీ తరువాయి)

కొన్ని రకాల మెడిసిన్ ధరలు, ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు, మొబైల్స్, ట్యాబ్లెట్స్, తోలు, వస్త్ర పరిశ్రమ ఉత్పత్తుల ధరలు తగ్గే అవకాశం ఉంది. క్యాన్సర్, డయాబెటిస్ సహా 17 రకాల ఔషధాల ధరలు తగ్గనున్నాయి. విదేశీ విద్య, వైద్య పరికరాలు, టూర్ ప్యాకేజీలపై పన్ను తగ్గింపు నేపథ్యంలో ఖర్చులో కాస్త ఊరట దక్కనుంది. సముద్ర ఆహార ప్రాసెసింగ్ ఇన్‌పుట్‌లకు సుంకం లేని దిగుమతిని ప్రస్తుత పరిమితిని మూడు రెట్లు పెంచారు. మైక్రోవోవెన్ల తయారీలో ఉపయోగించే నిర్దిష్ట భాగాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మినహాయిస్తున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీంతో ఈ ఉత్పత్తుల ధరలు తగ్గనున్నాయి. ఈవీ బ్యాటరీలు, సోలార్ ప్యానల్స్ ధరలు కూడా తగ్గే అవకాశం ఉంది. ఆల్కాహాల్, సిగరెట్, పాన్ మసాలా వంటి హానికర ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. వీటిపై అధిక ఎక్సైజ్ సుంకం విధించాలని కేంద్రం నిర్ణయించింది. వ్యక్తిగతంగా దిగుమతి చేసుకున్న కొన్ని ఉత్పత్తులపై విధించే సుంకం పెంచుతున్న నేపథ్యంలో వాటి ధరలు పెరగనున్నాయి. లగ్జరీ వాచ్ లు, విదేశీ మద్యం ధరలు పెరగనున్నాయి.

## హైదరాబాద్ నుంచి హై స్పీడు రైల్ కారిడార్లు

**హైదరాబాద్:** దేశ రైల్వే చరిత్రలోనే ఇదో ముందడుగు. ప్రస్తుతం ముంబై--అహ్మదాబాద్ మధ్య బుల్లెట్ రైలు ప్రాజెక్టు పనులు పూర్తికావస్తున్న దశలో, ఒకేసారి ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లను పట్టాలెక్కించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందులో మూడు హైదరాబాద్‌తో అనుసంధానమవడం విశేషం. బుల్లెట్ రైలు ప్రాజెక్టు తరహాలోనే వీటి నిర్మాణం ఉండనుంది. హైదరాబాద్--పుణె, హైదరాబాద్--చెన్నై, హైదరాబాద్--బెంగుళూరు మధ్య ఎలివేటెడ్ పద్ధతిలో ఇవి రూపొందనున్నాయి. ఒక్కో ప్రాజెక్టు దాదాపు రూ.లక్షన్నర కోట్ల భారీ వ్యయంతో రూపొందనున్నాయి. ఇవి పూర్తయితే, ప్రస్తుతం రైలు మార్గంలో ఆ మూడు నగరాలకు అవుతున్న ప్రయాణ సమయం మూడో వంతుకుపైగా తగ్గిపోనుంది. ప్రస్తుతం 13 గంటల చెన్నై ప్రయాణ సమయం మూడు గంటలకు, బెంగుళూరుకు 9 గంటలకు బదులు రెండు గంటల్లో, పుణెకు ఎనిమిది గంటలకు బదులు రెండు గంటలలోపు సమయంలోనే చేరుకోవచ్చు. ఇది రైలు రవాణాలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతుంది.

### 'హైదరాబాద్--ముంబై'రెండు భాగాలుగా...

హైదరాబాద్--ముంబై మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్‌కు గతంలోనే రైల్వే శాఖ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే దానికి సంబంధించిన డీపీఆర్ కూడా పూర్తయింది. ఇప్పుడు దాన్ని రెండు భాగాలు చేసి, రెండు కారిడార్లుగా నిర్మించనున్నారు. ఆదివారం కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లలో రెండు ఇవే. గతంలో హైదరాబాద్--ముంబై హైస్పీడ్ రైల్ కారిడార్‌గా ఉన్న ప్రాజెక్టును ఇప్పుడు హైదరాబాద్--పుణె, పుణె--ముంబైగా మార్చారు. ' హైదరాబాద్--పుణె--ముంబై కారిడార్ నిర్మాణానికి గతంలోనే రంగం సిద్ధమైంది. 760 కి.మీ.నిడివితో ఉండే ఈ ప్రాజెక్టు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉంది. ' 2020 మార్చిలో ట్రాఫిక్ డిమాండ్ ఫోర్‌కాస్టింగ్, ప్రిలిమినరీ ఇంజినీరింగ్ సర్వేలు, జియోటెక్నికల్ అసెస్‌మెంట్‌లు నిర్వహించారు. మార్గం, మ్యాపింగ్, మట్టి పరీక్షలు, ఎలివేటెడ్/అండర్‌గ్రౌండ్ సెక్షన్ల అంచనా వ్యయాన్ని ప్రాథమికంగా రూపొందించారు. 2020 చివరి నుంచి 2021లో హైవే ఇంజినీరింగ్ మాగ్నట్యూడ్ కన్సార్టియం, ట్రాన్స్‌లింక్ కన్సల్టెంట్స్ కాంట్రాక్టర్లు జనరల్ అలైన్‌మెంట్ డ్రాయింగ్స్, యుటిలిటీ సర్వే (ఓవర్‌హెడ్, అండర్‌గ్రౌండ్ యుటిలిటీలు), పవర్ సోర్సింగ్ ఆప్షన్లు గుర్తించారు. ఈ కారిడార్‌కు ప్రయాణికుల డిమాండ్ అంచనాలు, పర్యావరణ ప్రభావ అంచనాలు కూడా రూపొందించారు. ఇప్పటికే డీపీఆర్‌ను కూడా రూపొందించి రైల్వే బోర్డుకు అందజేశారు. అది బోర్డు పరిశీలనలో ఉంది. ' మహారాష్ట్ర, తెలంగాణలో 250--300 గ్రామాలు ప్రభావితమవుతాయని అంచనాకొచ్చారు. లైడార్ సర్వే కూడా



చేశారు. ప్రస్తుతం ముంబైకి హైదరాబాద్ నుంచి రైలు మార్గంలో 14 గంటల సమయం అవుతుండగా, హైస్పీడ్ రైలు ద్వారా కేవలం మూడు గంటల్లోనే గమ్యం చేరుకునే వీలుంటుంది. ఈ రైలు 350 కి.మీ.గరిష్ట వేగ సామర్థ్యం ఉంటుండగా, ఆపరేషనల్ స్పీడ్ 320 కి.మీ.గా ఉంటుందని అప్పట్లో అధికారులు పేర్కొన్నారు. ఇది స్టాండర్డ్ గేజ్ (1,435 మి.మీ.), 25 కేవీ ఏసీ ఓవర్‌హెడ్ ట్రాక్షన్‌తో ఉంటుంది. ఎలివేటెడ్, అండర్‌గ్రౌండ్‌తో కలిపి కారిడార్ ఉంటుంది. ఈ రైల్లో 750 మంది వరకు ప్రయాణికులు వెళ్లే వీలుంటుంది. ' ప్రతిపాదిత స్టేషన్లు (మొత్తం 11) ఇలా: హైదరాబాద్, జహీరాబాద్, కలబురిగి, సోలాపూర్, పండరీపూర్, అక్లోజ్, దౌండ్, పుణె, లోనావాలా, నవీ ముంబై, కుర్లా కాంప్లెక్స్, బాంద్రా, ముంబై.

### మూడు గంటల్లో చెన్నై...

హైదరాబాద్--చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రతిపాదన రెండేళ్లుగా ఉంది. గతేడాది ఓ అలైన్‌మెంటును రూపొందించిన రైల్వే శాఖ తమిళనాడు ప్రభుత్వానికి సమర్పించింది. రైట్స్ లిమిటెడ్ ఫైనల్ అలైన్‌మెంట్ సర్వే ట్రాఫిక్ పొటెన్షియల్ అనాలిసిస్ నిర్వహించింది. తమిళనాడు అభ్యర్థన మేరకు అలైన్‌మెంట్‌ను సవరించి, తిరుపతి స్టేషన్‌ను చేర్చారు. నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆర్వీ అసోసియేట్స్, జీఎస్ఎల్ అసోసియేట్స్‌లకు అలైన్‌మెంట్ డిజైన్, లైడార్ సర్వే కాంట్రాక్టులు ఇచ్చారు. ప్రాథమిక డీపీఆర్‌ను రూపొందించగా, తుది డీపీఆర్‌ను సిద్ధం చేయాల్సి ఉంది. రెండు నగరాల మధ్య 710 కి.మీ. దూరం ఉండగా, 12--14 గంటల ప్రయాణ సమయం పడుతోంది. హైస్పీడ్ రైల్లో ఆ దూరాన్ని కేవలం 3 గంటల్లోనే చేరుకోవచ్చని అంచనా. ' హైదరాబాద్--బెంగళూరు కారిడార్‌ను కూడా గతేడాది ప్రతిపాదించారు. 2025 సర్వే కసరత్తు ప్రారంభించారు. రెండు నగరాల మధ్య 626 కి.మీ. దూరం ఉండగా, ప్రస్తుతం రైళ్లు 8 గంటలను మించి సమయం తీసుకుంటున్నాయి. ఇప్పుడు ఆ దూరాన్ని రెండు గంటల్లోనే చేరుకోవచ్చు. ఎలివేటెడ్ పద్ధతిలో హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి రూ.1.2 లక్షల కోట్లు ఖర్చవుతుందని అంచనా.

## ఏప్రిల్ 1 నుంచి నూతన ఆదాయపు పన్ను చట్టం

**న్యూఢిల్లీ:** రానున్న ఏప్రిల్ 1వ తేదీ నుంచి నూతన ఆదాయ పన్ను చట్టం అమల్లోకి వస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆమె లోక్‌సభలో ప్రసంగిస్తూ, సామాన్యులు కూడా ఫైల్ చేసేలా ఆదాయపు పన్ను చట్టంలో మార్పులు చేసినట్లు చెప్పారు. సరళతరం చేసిన ఫారాలు త్వరలో అందుబాటులోకి వస్తాయని ఆమె తెలిపారు. సవరించిన పన్ను రిటర్నుల దాఖలు గడువును పెంచుతున్నట్లు తెలిపారు. డిసెంబర్ 31తో గడువు ముగిసిందని, దీనిని మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. విదేశీ యాత్రలపై పన్ను తగ్గిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే విదేశీ విద్య, వైద్యంపై టీడీఎస్ 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించనున్నట్లు తెలిపారు. మానవ వనరుల సరఫరా సంస్థలపై కూడా టీడీఎస్ తగ్గించనున్నట్లు తెలిపారు. ఈ ఏజెన్సీలపై 1 లేదా 2 శాతం టీడీఎస్ వర్తిస్తుందని అన్నారు. రహదారి ప్రమాదాల పరిహారం వడ్డీపై పన్నును తొలగిస్తున్నామని అన్నారు. చిన్న మొత్తంలో పన్ను చెల్లింపులు జరిపే వారికి కూడా ప్రత్యేక పథకం తీసుకు వస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి విదేశీ ఆస్తుల వివరాలు వెల్లడించడం తప్పనిసరి అని నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం సందర్భంగా స్పష్టం చేశారు. అదే సమయంలో కంపెనీల బైబ్యాక్ విధానాలకు కేంద్ర ఆర్థిక మంత్రి షాకిచ్చారు. కార్పొరేట్ బైబ్యాక్ కొనుగోళ్లపై 2 శాతం పన్ను విధించనున్నట్లు తెలిపారు. నాన్-కార్పొరేట్ బైబ్యాక్ కొనుగోళ్లపై 30 శాతం పన్ను విధిస్తున్నట్లు తెలిపారు. పన్ను వివాదాల్లో క్రిమినల్ చర్యల తీవ్రతను తగ్గిస్తున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇలాంటి వివాదాల్లో జైలు శిక్షను రెండేళ్లకు తగ్గిస్తున్నట్లు ప్రకటించిన ఆర్థిక మంత్రి, జరిమానా చెల్లిస్తే కనుక ఆ జైలు శిక్ష నుంచి కూడా మినహాయింపు ఉండనుందని ప్రకటించారు.

## బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం..

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశపెట్టిన బడ్జెట్ తమను నిరాశ పర్చిందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తాను, సీఎం రేవంత్, సహచర మంత్రులు, ఎంపీలు పలు దఫాల్లో బృందాలుగా వెళ్లి దేశ ప్రధాని, ఆర్థిక మంత్రిని కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'హైదరాబాద్ ప్రపంచానికి ఫార్మా రాజధాని వంటిది. కోవిడ్ సమయంలో ప్రధాని మోదీ స్వయంగా వచ్చి ప్రశంసించిన భారత్ బయోటెక్ ఈ మట్టిలోనే ఉంది. కానీ బయో ఫార్మా కేటాయింపుల్లో తెలంగాణ పేరు లేకపోవడం విడ్డూరం. ఎలక్ట్రానిక్స్ రంగానికి రూ.40 వేల కోట్లు కేటాయించి, ఈసీఐఎల్ వంటి దిగ్గజ సంస్థలున్న హైదరాబాద్‌కు ఒక్క పైసా ఇవ్వకపోవడం నిరాశ పరిచింది. హైదరాబాద్ అంటే ఎలక్ట్రానిక్స్. ఎలక్ట్రానిక్స్ అంటే హైదరాబాద్ అన్న నానుడిని కేంద్రం చెరిపివేసే ప్రయత్నం చేస్తోంది. భవిష్యత్ తరాలకు అత్యంత కీలకమైన ఆరెంజ్ ఎకానమీ (ఆడియో, వీడియో, గేమింగ్, కామిక్స్) రంగంలో హైదరాబాద్ ప్రపంచస్థాయి సామర్థ్యాన్ని కలిగి ఉంది. కానీ కేంద్రం ఉద్దేశపూర్వకంగా ముంబైకి మళ్లించింది. మెడికల్ టూరిజంలో దేశానికే తలమానికంగా ఉన్న తెలంగాణను విస్మరించి, ఇతర రాష్ట్రాలకు రీజినల్ మెడికల్ వ్యాల్యూ హబ్‌లు ఇవ్వడం ఏ చట్టం కిందకు వస్తుంది. ఇలా అన్ని రంగాల్లో హైదరాబాద్‌ను పట్టించుకోకుండానే బడ్జెట్ ప్రతిపాదనలు పెట్టారు'అని వ్యాఖ్యానించారు.

### భారీ నిధులు వస్తాయని ఆశించాం

హైదరాబాద్ నగరాభివృద్ధికి కీలకమైన మూసీ పునరుజ్జీవం, రీజినల్ రింగ్ రోడ్, మెట్రో రైలు విస్తరణ వంటి ప్రాజెక్టులకు భారీగా నిధులు ఆశించాం..కానీ ఒక్క ప్రాజెక్టుకు కూడా కేటాయింపులు లేకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందని భట్టి అన్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమ కోసం సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమలు, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ప్రధానిని కలిసినా ఫలితం లేకపోయిందని చెప్పారు. రామప్ప దేవాలయం, మన్ననూరు, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లు, చారిత్రక ఆలయాలతో టూరిజం కేంద్రంగా ఉన్న తెలంగాణకు టూరిజం ప్యాకేజీలో కేంద్రం స్థానం కల్పించకపోవడం అన్యాయమన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం ద్వారా గ్రామీణ పేదల బతుకుతెరువును దెబ్బతీస్తోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమంపై బడ్జెట్ మౌనాన్ని వహించడం సామాజిక న్యాయానికి విరుద్ధమన్నారు. కేంద్రానికి ఒక నీతి, రాష్ట్రానికి ఒక నీతా అని భట్టి ధ్వజమెత్తారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు పార్టీలు, రాజకీయాలకతీతంగా బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు న్యాయం కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

# వాట్సప్ స్క్రీన్ షేర్ చేస్తే
# మీ ఖాతా ఖాళీ

**సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈ తరుణంలో ప్రజలు మోసాల బారిన పడకుండా పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూనే ఉన్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో ప్రజలను దోచుకుంటున్నారు. డిజిటల్ అరెస్ట్, ఏపీకే ఫైల్స్, ఓటీపీ తరహా సైబర్ మోసాలపై పోలీసులు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో కొత్తగా వాట్సప్ స్క్రీన్ షేరింగ్‌తో మోసాలను మొదలుపెట్టారు.**

కస్టమర్ సపోర్ట్, బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసి మీ అకౌంట్‌లో సమస్యలున్నాయని లేదా ఇ-కేవైసీ అప్‌డేట్ చేయాలని కేటుగాళ్లు నమ్మబలుకుతారు. వెంటనే చేయకపోతే అకౌంట్ బ్లాక్ అవుతుందంటూ కంగారు పెడతారు. అసలు ఆలోచించడానికే సమయం ఇవ్వరు. మీరు వీడియో కాల్ చేసి వాట్సప్ స్క్రీన్ షేర్ చేస్తే ఆ ప్రక్రియంతా తామే పూర్తి చేస్తామని నమ్మబలుకుతారు. వారి మాటలు నమ్మి ఒకసారి స్క్రీన్ షేర్ చేశారో ఇక అంతే మీ ఫోన్ మొత్తం సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లినట్లే. మీ ఖాతాల్లో సొమ్ము మొత్తం ఖాళీ చేస్తారు. ఇటీవల కాలంలో ఈ తరహా నేరాలు పెరిగిపోతున్నాయి. దీంతో ఎవరు ఫోన్ చేసి స్క్రీన్ షేర్ చేయమని అడిగినా ఎట్టి పరిస్థితుల్లో చేయొద్దని నిపుణులు సూచిస్తున్నారు.

### స్క్రీన్ షేరింగ్ మోసం ఇలా..

స్క్రీన్ షేరింగ్ అంటే ఒక డివైజ్ స్క్రీన్ ఇంకొక డివైజ్‌లో డిస్‌ప్లే అవ్వడం. హ్యాకర్ ఎవరినైతే లక్ష్యంగా చేసుకుంటాడో అతడి వాట్సప్ స్క్రీన్‌షేరింగ్‌ను తన కంప్యూటర్‌లో కనిపించేలా చేస్తాడు. సాధారణంగా వర్క్‌ఫ్రమ్ హోమ్ చేసేటప్పుడు సాంకేతికంగా సమస్య తలెత్తిన సందర్భాల్లో నిపుణులు స్క్రీన్ షేర్ లేదా రిమోట్‌గా మన పీసీని ఆపరేట్ చేస్తుంటారు. అదే తరహాలో మిమ్మల్ని మాటల్లో పెట్టి మీ ఫోన్‌లో చేసే ప్రతిదీ నేరగాళ్లు తెలుసుకుంటారు. పిన్, పాస్‌వర్డ్, ఓటీపీలన్నీ చూస్తారు. తద్వారా మీ ఖాతాలోని నగదు కాజేస్తారని సైబర్ నిపుణులు చెబుతున్నారు.

### అస్సలు నమ్మొద్దు: పోలీసులు

"కస్టమర్ సపోర్ట్, బ్యాంక్ సిబ్బంది పేరిట కాల్స్ చేసి వాట్సప్ స్క్రీన్ షేరింగ్ ఇవ్వాలని కోరితే అస్సలు నమ్మొద్దు. సాయం చేస్తామని నమ్మించి మీ అకౌంట్‌లోని డబ్బులు కాజేస్తారు. ఖాతా వివరాలు, ఓటీపీ తస్కరిస్తారు. అపరిచిత కాల్స్‌తో అప్రమత్తంగా ఉండండి. ఎట్టిపరిస్థితుల్లోనూ ఏమరపాటుగా ఉండొద్దు. మీ సన్నిహితులు, ఇంట్లోని పెద్దలకు ఇలాంటి మోసాలపై అవగాహన కల్పించండి" అని పోలీసులు కోరుతున్నారు. ఇవే కాదు.. వాట్సప్ గ్రూపుల్లో వచ్చే ఇన్వెస్ట్‌మెంట్ టిప్స్ నమ్మొద్దని హితవు పలుకుతున్నారు. ఈజీమనీ ఆశతో ఎలాంటి లింక్‌లపైనా క్లిక్ చేయొద్దని, వాట్సప్ గ్రూపుల్లో వచ్చే ఏపీకే ఫైల్స్‌ను ఎట్టి పరిస్థితుల్లో డౌన్‌లోడ్ చేయొద్దని పోలీసులు సూచిస్తున్నారు.





## మాపై దాడిచేస్తే 'ప్రాంతీయ యుద్ధమే'
### ట్రంప్‌కు ఖమేనీ హెచ్చరిక

**ఇరాన్ :** అణు ఒప్పందంపై చర్చలకు రాని పక్షంలో భీకర స్థాయిలో విరుచుకుపడతామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలను ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ తీవ్రంగా ఖండించారు. అమెరికా ఏదైనా దాడి చేస్తే.. అది మధ్యప్రాచ్యంలో ప్రాంతీయ యుద్ధానికి దారితీస్తుందని హెచ్చరించారు. "మేం యుద్ధాన్ని ప్రేరేపించేవాళ్లం కాదు. ఏ దేశంపైనా దాడులు చేయాలని కోరుకోవడం లేదు. కానీ.. మాపై దాడి చేసినా, మమ్మల్ని వేధించినా.. వారికి గట్టి జవాబు చెబుతాం. ఒకవేళ యుద్ధాన్ని ప్రారంభిస్తే.. అది 'ప్రాంతీయ యుద్ధం'గా మారుతుందనే విషయాన్ని అమెరికన్లు గ్రహించాలి" అని ఖమేనీ పేర్కొన్నట్లు ఇరాన్ అధికారిక మీడియా తెలిపింది. మరోవైపు, హర్మూజ్ జలసంధిలో సైనిక విన్యాసాలకు ఇరాన్ ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే, ఈ విన్యాసాల సమయంలో అమెరికన్ (ఖూూా) యుద్ధనౌకలు, విమానాలపై బెదిరింపు చర్యలకు దిగొద్దని, వాణిజ్య నౌకల రాకపోకలకు అంతరాయం కలిగించవద్దని అమెరికా సైనిక కేంద్ర కమాండ్ హెచ్చరించింది. తమ దేశానికి చెందిన మరిన్ని యుద్ధనౌకలు ఇరాన్ దిశగా కదులుతున్నట్లు ట్రంప్ వెల్లడించిన వేళ ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



## 'మీ చరిత్ర అందరికీ తెలిసిందే'..
### పాక్‌కు భారత్ చురకలు

**న్యూఢిల్లీ :** బలోచిస్థాన్ ఘటనల్లో భారత్ హస్తం ఉందంటూ పాకిస్థాన్ చేసిన ఆరోపణలను విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. అంతర్గత వైఫల్యాల నుంచి అందరి దృష్టిని మళ్లించేందుకు ఆ దేశానికి ఇది అలవాటైన వ్యూహమేనని పేర్కొంది. "పాకిస్థాన్ చేసిన నిరాధార ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎప్పటిలాగే స్వీయ అంతర్గత వైఫల్యాల నుంచి అందరి దృష్టిని మళ్లించేందుకు రచించిన సాధారణ వ్యూహమే ఇది. హింసాత్మక ఘటన జరిగిన ప్రతిసారీ పనికిమాలిన వాదనలు చేసే బదులు.. ఆ ప్రాంత ప్రజల దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించడంపై దృష్టి సారించడం మంచిది. అణచివేత, క్రూరత్వం, మానవ హక్కుల ఉల్లంఘనల విషయంలో పాకిస్థాన్ చరిత్ర అందరికీ తెలిసిందే" అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ ఓ ప్రకటన విడుదల చేశారు. బలోచిస్థాన్ ప్రావిన్సులోని ఆయా ప్రాంతాల్లో శనివారం పాక్ సైన్యం చేపట్టిన ఆపరేషన్‌లో 92 మంది మిలిటెంట్లు మృతి చెందారు. మరో 15 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలోనే బలోచిస్థాన్‌లో శాంతిని దెబ్బతీసేందుకు ఉగ్రశక్తులకు భారత్ మద్దతు ఇస్తోందని పాక్ సైన్యం ఆరోపించింది.

## ఒంటరి మహిళలను
# మోసగిస్తున్న మాయగాడు
### పెళ్లి పేరుతో రప్పిస్తాడు.. ఆభరణాలతో ఉడాయిస్తాడు



రాజమహేంద్రవరం : వివాహ సంబంధాల కోసం మ్యాట్రిమోనీల్లో వివరాలు నమోదు చేసుకున్న ఒంటరి, వితంతు మహిళలను పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. వారి బంగారు ఆభరణాలను అపహరిస్తున్న ఘరానా మోసగాడిని ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సెంట్రల్ జోన్ ఇన్‌ఛార్జి డీఎస్పీ శ్రీకాంత్ వివరాలు వెల్లడించారు. చిత్తూరు జిల్లా పలమనేరు మండలం పి.వడ్డూరు గ్రామానికి చెందిన చల్లా నారాయణ ఎలియాస్ నారాయణ కృష్ణ వివిధ పేర్లతో మ్యాట్రిమోనీల్లోని వివరాలతో వితంతు, ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకునేవాడు. తాను గోవాలో బంగారు వ్యాపారినంటూ వారికి వివాహ ప్రతిపాదనలు పంపేవాడు. పరిచయం పెంచుకున్నాక.. నీ జాతకంలో దోషాలు ఉన్నాయని, రాజమహేంద్రవరం వస్తే గోదావరిలో పుణ్యస్నానమాచరించి పూజలు చేద్దామంటూ నమ్మించేవాడు. నగలు పెట్టుకుని వస్తే మా తల్లిదండ్రులకు కూడా నచ్చుతావంటూ మాయమాటలు చెప్పేవాడు. ఇలా విశాఖ, నెల్లూరు, కడప, శ్రీకాకుళం, హైదరాబాద్‌కు చెందిన పలువురు మహిళలు రాజమహేంద్రవరం వచ్చారు. స్నానమాచరించిన అనంతరం పూజా సామగ్రి తీసుకొస్తానని చెప్పి, వారు తెచ్చిన బంగారు ఆభరణాల బ్యాగులతో ఉడాయించేవాడు. తొమ్మిది నెలల కాలంలో ఇతడిపై రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఐదు చీటింగ్ కేసులు నమోదయ్యాయని డీఎస్పీ వెల్లడించారు. నిందితుడి నుంచి సుమారు రూ.75 లక్షల విలువచేసే 340 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు కార్లు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో పలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో పోక్సో, చీటింగ్, మర్డర్, రౌడీషీట్ తదితర ఏడు కేసులున్నాయి. కర్ణాటకలోని చిక్‌భళ్లాపుర పరిధిలో నాన్ బెయిల్‌బుల్ వారెంట్ ఉంది.

## అమెరికాతో యుద్ధం కోరుకోవడం లేదు
### ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్



**ఇరాన్ :** ఇరాన్- అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశంలోని ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపి.. అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ నాయకులు అశాంతిని రేకెత్తిస్తున్నారని ఆరోపించారు. అయితే, అగ్రరాజ్యంతో తాము యుద్ధం కోరుకోవడం లేదన్నారు. స్థానిక మీడియాలో ప్రసారమైన వీడియోలో పెజెష్కియాన్ మాట్లాడుతూ.. "అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, యూరప్ నేతలు మా సమస్యలను లక్ష్యంగా చేసుకున్నారు. మా ప్రజలను రెచ్చగొట్టి.. దేశాన్ని ముక్కలు చేయడానికి ప్రయత్నించారు. ఇప్పటికీ ప్రయత్నిస్తున్నారు" అని ఆరోపించారు. ఇరాన్‌లో జరిగిన ఆందోళనలు కేవలం సామాజిక నిరసనలు కావని అందరికీ తెలుసన్నారు. ఇక, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తాహ్ ఎల్‌సిసితో.. పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా అమెరికాతో తాము యుద్ధం కోరుకోవడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌కు గానీ, అమెరికాకు గానీ సంఘర్షణలు ప్రయోజనకరం కావని వ్యాఖ్యానించారు.

#### చర్చలకు వచ్చిన ఇరాన్: ట్రంప్

మరోవైపు, ఇరాన్ తమతో చర్చలకు వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఆయన ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. "వారు మాతో మాట్లాడుతున్నారు. ఏదైనా ఒప్పందం జరుగుతుందో లేదో చూడాలి. మొత్తంగా ఏం జరుగుతుందో చూద్దాం" అన్నారు. అయితే, అమెరికా యుద్ధనౌకలు ఇరాన్ దిశగా కదులుతున్నాయని పరోక్షంగా హెచ్చరికలు చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా దాడి ప్రణాళికల గురించి ఇప్పుడే ఏం చెప్పలేమన్నారు.



## భారత్‌కు వెనెజువెలా చమురు: ట్రంప్

**యూఎస్ :** భారత చమురు దిగుమతుల గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. వెనెజువెలా నుంచి చమురు దిగుమతులకు భారత్ ముందుకొచ్చిందని పేర్కొన్నారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "మేము ఇప్పటికే వెనెజువెలాతో ఒక డీల్ కుదుర్చుకున్నాం. ఇందులో భారత్ కూడా చేరనుంది. భారత్ ఇకపై వెనెజువెలా చమురును దిగుమతి చేసుకుంటుంది. దీనికి సంబంధించిన ఒప్పందంపై ఒక అవగాహనకు వచ్చాం" అని ట్రంప్ తెలిపారు. అయితే, దీనిపై భారత్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇక, వెనెజువెలా చమురు కోసం చైనా కూడా తమతో చర్చలు జరిపే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు తెలిపారు. దాన్ని మేము స్వాగతిస్తామన్నారు. మరోవైపు వెనెజువెలాలో పాలనపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దేశం ఇప్పుడు తన అధీనంలోనే ఉందన్నారు. తాను కోరుకున్నట్లుగానే ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. అక్కడి చమురు నిల్వలు పూర్తిగా అమెరికా చేతికి వచ్చే వరకు ఆమెనే తాత్కాలిక నాయకురాలిగా కొనసాగుతారని తెలిపారు. వెనెజువెలాపై సైనిక దాడి చేసి.. ఆ దేశ నేత నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత రోడ్రిగ్జ్ తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. భారత ప్రధాని మోదీ - రోడ్రిగ్జ్‌లు ఇటీవల ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులతో సహా పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించుకున్నారు.



## ఈయూ మిలిటరీపై ఇరాన్ 'ఉగ్ర'ముద్ర

**ఇరాన్ :** ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఐరోపా దేశాలకు చెందిన మిలిటరీని ఉగ్రవాద గ్రూపులుగా పరిగణించనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగర్ ఖాలీబాఫ్ తెలిపారు. ఇటీవల ఆ దేశ సైన్యంలో కీలక విభాగమైన 'ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ)'ను ఈయూ ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతిస్పందనగా ఇరాన్ తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అమెరికాను నమ్మి తమ సొంత ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఈయూ నిర్ణయాలు తీసుకుంటోందని ఖాలీబాఫ్ విమర్శించారు. ఈ సందర్భంగా అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు వ్యతిరేకంగా చట్టసభ సభ్యులు నినాదాలు చేశారు.



## నేలకొండపల్లి పట్టణ పద్మశాలి కమిటీ ఎన్నిక

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లి పద్మశాలి మండల అధ్యక్షుడు ఎలిగేటి గిరి, కార్యదర్శి సామల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నేలకొండపల్లి టౌన్ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. టౌన్ కమిటీ అధ్యక్షుడు సామల బ్రహ్మం, ఉపాధ్యక్షుడు గజేంద్ర రామారావు, కార్యదర్శి ఎలిగేటి వెంకటేష్, కోశాధికారి కుసుమ ఉపేందర్,సలహాదారులుగా యరగుంట్ల రమేష్, యచ్చ సైదేశ్వరావు (=పీూ), ఏనుగుల నాగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.నూతనంగా ఎన్నికైన కమిటీకి ముఖ్య అతిథిలు పాలేరు నియోజకవర్గం కార్యదర్శి తుమ్మా ఉపేందరావు, నియోజక వర్గం ఉపాధ్యక్షుడు మోర మల్లయ్య శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి పద్మశాలి కుల పెద్దలు దేవరశెట్టి రాము, కుసుమ జనార్ధన్, ఎలిగేటి వెంకటేశ్వర్లు, రచ్చ సహదేవ్, కట్టకం శ్రీను, రచ్చ సైదులు, ఎర్రగుంట్ల సత్యనారాయణ,మోర సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



## కనుల పండువగా కళ్యాణ మహోత్సవం..!

### స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** కూసుమంచి మండల కేంద్రంలో ఆధ్యాత్మిక పరవశం వెల్లివిరిసింది.శ్రీ స్వామివార్ల తిరుకళ్యాణ మహోత్సవం భక్తుల జయజయధ్వానాల మధ్య అత్యంత వైభవంగా జరిగింది.మంగళవాయిద్యాలు,వేద మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.ఈ వేడుకకు కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు.ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు,గ్రామ పెద్దలు ఆయనకు ఘన స్వాగతం పలికారు.స్వామివార్ల కళ్యాణ ఘట్టం సందర్భంగా ఆయన పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.పూజల అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్వామివారి కృపతో కూసుమంచి నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని,ప్రతి ఇంటా సుఖసంతోషాలు నిండాలని ఆకాంక్షించారు.శాంతి, సమృద్ధి కలగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.





## సీట్ నోటీసుల కక్ష సాధింపులకు నిరసనగా బిఆర్ఎస్ నాయకులు ధర్నా

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాన్ని పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మాజీ సీఎం రైతు బాంధవుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావుకి సీట్ నోటీసు విచారణ పేరిట పిలుస్తున్న సందర్భంగా మండల స్థాయి నాయకులు బిఆర్ఎస్ కార్యకర్తలు మండల బస్టాండ్ చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేశారు, అనంతరం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల అన్ని గ్రామాల బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## ఆశీర్వదించండి... అండగా వుంటాను

### కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వై ఎల్ ఎన్ గౌడ్

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట పట్టణంలోని 38వ వార్డులో కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ వేసిన వైఎల్ ఎన్ గౌడ్ ఆదివారం ప్రచారం ప్రారంభించారు. వార్డులో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ తీశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పోటీ చేయడానికి అవకాశం కల్పించిన ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ కి , డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య కు ధన్యవాదాలు తెలియజేశారు.తాను 1995 లో సూర్యాపేటలో ఈ వార్డులో కౌన్సిలర్ గా పనిచేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని, సిసి రోడ్ నిర్మాణం డ్రైనేజీ నిర్మాణం చేశానని, ఇంటింటికి నల్ల సౌకర్యం కల్పించానని చెప్పారు. కరోనా సమయంలో ప్రజలకు కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశానని తెలిపారు ఈసారి గెలిపిస్తే తాను వార్డు ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడతానని ఎవరికి ఏ కష్టం వచ్చినా తాను ఆదుకుంటానని , వార్డు అందుబాటులో ప్రజలకు ఉంటానని, వార్డులో పెన్షన్ రాని వాళ్ళకి పెన్షన్లు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం కృషి చేస్తానని చెప్పారు.వృద్ధులకు పెన్షన్లు వార్డులో ఇచ్చే విధంగా అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని అన్నారు.తనను వార్డు ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు అంతటి పాపయ్య గౌడ్, చికూరి శ్రీను గౌడ్, ఆకుల యుగేందర్, అబ్దుల్ రహీమ్,దంతాల శ్రీను, శైలజ,సుజాత,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఏదులాపురం మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరాలి

- మంత్రి కొండా సురేఖ
- ప్రభుత్వ పథకాలే అస్త్రాలుగా ప్రజల్లోకి వెళ్లండి
- ఐక్యతతోనే విజయం సాధ్యం, సన్నాహక సభలో పిలుపు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** మున్సిపల్ ఎన్నికల సమరంలో కాంగ్రెస్ శ్రేణులు సైనికుల్లా కదలాలని, సంక్షేమ పథకాలను ఆయుధాలుగా చేసుకుని ప్రతి ఇంటి గడపను తట్టాలని రాష్ట్ర దేవాదాయ,అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు.ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణపురం టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణ కుమారి అధ్యక్షతన జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల క్షేత్రంలో పార్టీ జెండా రెపరెపలాడడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.అధికారంలో ఉన్నప్పుడు పదవుల కోసం పోటీ ఉండటం సహజమని, అయితే పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ఐక్యంగా ముందుకు సాగాలని మంత్రి



సూచించారు.మున్సిపాలిటీలోని 32 వార్డులకు గాను కాంగ్రెస్ నుంచి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు బరిలో నిలవడంపై ఆమె స్పందిస్తూ,మనలో మనమే కొట్లాడుకుంటే మూడో వ్యక్తి గెలిచే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.నేతలు చొరవ తీసుకుని అభ్యర్థులందరినీ ఏకతాటిపైకి తేవడం అభినందనీయమని పేర్కొన్న మంత్రి సురేఖ వార్డుకు ఒక్కరే అభ్యర్థి ఉండేలా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు.



### ప్రజాక్షేత్రంలో సంక్షేమ విజయాలు

మున్సిపాలిటీలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులతో రూపొందించిన కరపత్రాన్ని మంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పెంపు వంటి పథకాలు ప్రతి కుటుంబానికి కొండంత భరోసా ఇచ్చాయని ఆమె గుర్తు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సారథ్యంలో పాలేరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, ఇదే ఊపుతో మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుని ఆయనకు కానుకగా ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపుని చ్చారు. సోమవారం ఉదయం నాటికి అభ్యర్థులందరికీ బి-ఫామ్‌లు అందజేస్తామని, అప్పటి నుంచే ముమ్మర ప్రచారం మొదలుపెట్టాలని మంత్రి సూచించారు. వార్డుల్లో ఘన విజయం సాధిస్తేనే మున్సిపల్ ఛైర్మన్ పీఠం దక్కుతుందని, ఐక్యతతోనే అది సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ,మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య,నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, తుంబూరు దయాకర్ రెడ్డి,పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఇస్నాపూర్ మున్సిపాలిటీ నాలుగో వార్డ్‌లో నీలం కవిత ప్రచారం జోరు

### అడుగు అడుగున మహిళల నీరాజనాలు స్వాగతాలు

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్ :** ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ 4 వ వార్డ్ నుండి కాంగ్రెస్ పార్టీ బలపరి చిన కౌన్సిలర్ అభ్యర్థి నీలం కవిత ముదిరాజ్ నాలుగో రోజు ప్రచారంలో భాగంగా నిన్న సాయంత్రం లక్ష్మీనగర్ కాలనీలో వార్డ్ ఓటర్లతో కలిసి ఇంటి ఇంటి ప్రచారం నిర్వహించి చేతి గుర్తుకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించవలసిందిగా ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కవిత కు కాలనీవాసులు బ్రహ్మరథం పట్టి పూర్తి మద్దత్తు ప్రకటించారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అన్ని పార్టీల ప్రచారాలు జోరు అందుకున్న నేపథ్యంలో, నాలుగో వార్డ్ కు సంబంధించి నీలం కవిత ముదిరాజ్ కు చేతి గుర్తుకు ఓటు వేయాలని మహిళలు యువకులు అత్యధికంగా పాల్గొని ఇంటింటికి ప్రచారం చేస్తున్నారు.



## చదరంగంతో సృజనాత్మకత పెంపొందుతుంది

### చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గండూరి కృపాకర్

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** చదరంగంతో సృజనాత్మకత, మానసిక ధారుఢ్యం పెంపొందుతుందని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గండూరి కృపాకర్, ఎల్, సతీష్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్ 10, 14, 18, చెస్ క్రీడా పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన బాల బాలికలకు, షీల్డ్ లను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థిని, విద్యార్థులకు క్రీడలకు కొంత సమయం కేటాయిస్తే క్రీడల్లో రాణించవచ్చని చెప్పారు.చెస్ క్రీడా పోటీలను త్వరలో రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తామని చెస్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని సూర్యాపేటకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని



ఆకాంక్షించారు.జిల్లా చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సాయికుమార్,జిల్లా సంయుక్త కార్యదర్శి గడ్డం లింగారెడ్డి, కోశాధికారి వెంకట మురళి, నరసింహారావు,వరప్రసాద్, బాల,బాలికలు పాల్గొన్నారు.



## మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వంలోకి నీలం మధు

- చిట్కుల్ పోచమ్మ గుడిలో పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం
- కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఆయా వార్డు లలో ప్రచారం
- ప్రజల నుంచి అపూర్వ స్పందన

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ ప్రచారంలో పాల్గొన్నారు. అదివారం తన స్వగ్రామం చిట్కుల్ నుంచి మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని ఆయన పోచమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ 5,6, వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులతో కలిసి ఇంటిఇంటికి ప్రచారం సాగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఆయన ముందుకు సాగారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు 6 గారంటీలను అమలు చేస్తూ ప్రతి ఇంటికి సంక్షేమాన్ని దగ్గర చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని వివరించారు. పదేళ్ల కెసిఆర్ పాలనలో నిర్లక్ష్యం చేయబడిన అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలను అందిస్తూ రేవంత్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నాడని తెలిపారు. నూతనంగా ఏర్పడిన ఇస్నాపూర్ మున్సిపాలిటీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 15 కోట్ల రూపాయల ప్రత్యేక నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆ నిధులతో ప్రజలకు కావలసిన రోడ్లు, డ్రైనేజీలతో పాటు తాగునీటి సరఫరా పైప్ లైన్ నిర్మాణాలు మొదలు పెడతామన్నారు. ఈ ప్రాంత ప్రజలు విజ్ఞతతో ఆలోచించి మన ప్రాంత అభివృద్ధికి విశేషంగా సహకరిస్తున్న కాంగ్రెస్ పార్టీని ఆదరించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో 6వ వార్డ్ అభ్యర్థి సుంకరి రవీందర్, 5వ వార్డ్ అభ్యర్థి సంగన్నగారి జ్యోతి, కాంగ్రెస్ శ్రేణులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..



## ఎండీఆర్ ఫౌండేషన్‌కు
# మరో అవార్డ్..!

### గద్దర్ స్ఫూర్తి పురస్కారాలు కార్యక్రమంలో ఈ అవార్డు

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్ :** సమాజ సేవే ధ్యేయంగా, నిత్యం ప్రజల కోసం అంకితభావంతో పనిచేస్తున్న ఎండీఆర్ ఫౌండేషన్ కు గద్దర్ స్ఫూర్తి పురస్కారాలు కార్యక్రమంలో ప్రతిష్టాత్మక అవార్డు అందజేయబడింది. సామాజిక మార్పు కోసం తన జీవితాన్ని అర్పించిన ప్రజాగాయకుడు గద్దర్ జయంతి సందర్భంగా, హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంలో గద్దర్ స్ఫూర్తితో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎండీఆర్ ఫౌండేషన్ సేవలను గుర్తించి ఈ గౌరవం లభించడం జరిగింది. ఈ అవార్డు ప్రధానం కార్యక్రమంలో గద్దర్ కూతురు, తెలంగాణ సాంస్కృతిక సంఘం అధ్యక్షురాలు చైర్మన్ వెన్నెల ఎండీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులకు అందజేశారు. అనాథల అంత్యక్రియలు, పేదల సహాయం, వైద్య సేవలు, అత్యవసర సహాయ కార్యక్రమాలు వంటి అనేక సేవా కార్యక్రమాలతో సమాజంలో విశేషమైన గుర్తింపు పొందుతున్న ఎండీఆర్ ఫౌండేషన్‌కు ఇది మరో మైలురాయి. ఇలాంటి పురస్కారాలు మరింత సేవ చేయడానికి ప్రేరణగా నిలుస్తాయి. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రజల మధ్య మా జీవితాంతం ముందు ఉండి ప్రజలకు సేవ అందిస్తామని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నమని ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.



# సిట్ విచారణకు వ్యతిరేకంగా నిరసన

### బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంతకండ్ల జగదీశ్ రెడ్డి ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలతో బైటాయించి భారీ నిరసన తెలియజేశారు తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ని వ్యక్తిగతంగా అగౌరవపరచడమే ఏకైక లక్ష్యంగా చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ,చట్టాలను సైతం లెక్కచేయకుండా న్యాయవ్యవస్థను కించపరుస్తూ సిట్ నోటీసుల పేరుతో దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. సిట్ అధికారుల తీరును నిరసిస్తూ, ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని దాదాపు 1000 బైకులతో కోర్టు చౌరస్తా నుండి ప్రారంభమైన ర్యాలీ పి ఎస్ ఆర్ సెంటర్, వాణిజభవన్, శంకర్ విలాస్ సెంటర్, నుండి కొత్త బస్టాండ్ వరకు భారీ ర్యాలీ కొనసాగింది ఆదివారం నల్ల బ్యాడ్జీలతో శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగినది అదేవిధంగా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు ఆచరణ సాధ్యం కానీ హామీలతో మాయమాటలతో ఆరు గ్యారెంటీలు 420 అబద్ధపు హామీలతో పబ్బం గడుపుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డిని ఎండగట్టే దిశగా వారి తీరుపై మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, ట్రైకార్ మాజీ చైర్మన్ సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ రామచంద్రనాయక్, మాజీ గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాజీ మున్సిపల్ చైర్మన్ అన్నపూర్ణ,బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



### జిహెచ్ఎంసి కార్పొరేటర్ బరిలో బలరామ్ యాదవ్

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** రాబోయే జి హెచ్ ఎం సి ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఉంటుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, రాష్ట్ర పి ఎ సి ఛైర్మెన్ అరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని శ్రీ రామ్ నగర్ ఏ బ్లాక్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బలరాం యాదవ్ 200 మంది అనుచరులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ నీ కలిసి తనకు రాబోయే జి హెచ్ ఎం సి ఎన్నికల్లో శ్రీ రామ్ నగర్ కార్పొరేటర్ గా పోటీచేసే అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీచేసే అవకాశం కాంగ్రెస్ అధిష్టానం చూస్తుందని తాను కేవలం ప్రతిపాదనలు చేసి పంపడం వరకే తన పాత్ర ఉంటుందని అన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజలకు సేవచేసే వారికి పార్టీ తప్పకుండ అవకాశం ఇస్తుందని అన్నారు. ఈ సారి ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల సంఖ్య పెరుగుతుందని అన్నారు. ప్రజల్లో పేరు ఉండి గెలిచే అభ్యర్థులకు మాత్రమే పోటీచేసే అవకాశం ఉటుందని వివరించారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ వారికీ అందుబాటు లో ఉన్నవారే గెలిచే ఎక్కువ అవకాశం ఉంటుందని అన్నారు. నేను ఇస్తామని చెప్పిన అధిష్టానం ఒప్పుకోదని వారుకూడా శాస్త్రీయంగా వారి సర్వేలో ఎవరూ విజయం సాధిస్తారో వారికే అవకాశం కల్పిస్తుందని వివరించారు. పని చేయండి ప్రజలకు అందుబాటుల్లో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వాములై ప్రజా సేవకు అంకితం కావాలని బలరాం యాదవ్ కు సూచించారు. జి హెచ్ ఎం సి లో డివిజన్లు పెరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఎన్నికలు మరో 6 నెలల సమయం ఉందని తెలిపారు. పార్టీ అన్ని విషయాలు పరిగణలోకి తీసుకోని గెలుపు గుర్రాలకే జి హెచ్ ఎం సి ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బలరాం యాదవ్ అనుచరులు సుమారు 200 మంది అభిమానులతో శ్రీరామ్ నగర్ బ్లాక్ నుంచి భారీ కన్వాయ్ తో ఎమ్మెల్యే స్వగృహానికి తరలివెల్లారు. దారిపొడవున బలరాం యాదవ్ కు అనుకూలంగా నినాదాలు చేస్తూ ఎమ్మెల్యే గాంధీ ని కలసి బలరాం యాదవ్ కు కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ గా అవకాశం కల్పించేలా సిఫారసు చేసే భాధ్యత మీరు తీసుకోవాలి గెలిపించుకుని తీసుకు వచ్చే బాధ్యత మాది అని తెలియజేశారు.



## ఆత్మకూర్( ఎం).లో తుంగతుర్తి ఎమ్మెల్యే
# మందుల సామెల్‌కు నిరసన సెగ



**ఆత్మకూర్ (ఎం) రాజముద్ర న్యూస్ :** తెలంగాణా జాతిపిత బాపు కెసిఆర్ కి సిట్ ఇచ్చిన అక్రమ నోటీసు కు నిరసనగా ఆత్మకూర్ లో మండల పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన రాస్తారోకో కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తకు దారి తీసింది...ఎమ్మెల్యే ను అడ్డుకున్న దీ=ా శ్రేణులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమం లో ఆత్మకూరు సర్పంచ్ బీసు ధనలక్ష్మి,బి. ఆర్. ఎస్ జిల్లా నాయకులు యాస ఇంద్ర రెడ్డి ,ప్రతికంఠం పూర్ణ చందర్ రాజు,కోరే బిక్షపతి, మాజీ ఎంపీటీసీ యాస కవిత, మండల పార్టీ మహిళా అధ్యక్షులు సోలిపురం అరుణ, పొన్నగని జయశ్రీ,సర్పంచ్ లు ఎరుకల యాతిశ్వర్ గౌడ్,కొంగరి యాదగిరి, కోలా సత్తయ్య,సుంకరి పరుశరాములు,కట్టెకోలా శ్రీహరి,లోడి శ్రీనివాస్, పురుషోత్తం రెడ్డి,గజ్జెల్లి శంకర్,గుండెగాని సత్తయ్య, దొండ పురుషోత్తం రెడ్డి, కోరే బీరప్ప, లోడి మధు, మజ్జిగ రాంబాబు, గట్టు శంకర్, నాతి స్వామి,నాతి రాజు, రంగ సత్యనారాయణ, కొండపల్లి అబ్బాసాయిలు, ఎండీ అజీమోద్దీన్, బూడిద వెంకన్న,మాధ సత్తయ్య, గడ్డం సతీష్, గట్టు విశాల్, నాతి మల్లికార్జున్,గడ్డం గణేష్, రగటి మల్లేష్,పంజాల రాజు, ఎలిమినేటి మత్స్యగిరి, మహ్మద్ యూనుస్,మహ్మద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా
# 30 పోలీస్ యాక్ట్ అమలు

### సూర్యాపేట ఎస్పి కె.నరసింహ

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 28 నుండి "30 వరకు పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండ పై కార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు,జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, అసత్యాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని అన్నారు.చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్




ప్రకారం చర్యలు తప్పవు అని తెలిపారు.బాణాసంచా,డి జెలు ఉపయోగించవద్దు అని తెలియజేశారు



### షోలాపూర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపొందిన గుర్రం సత్యనారాయణను సన్మానించిన పద్మశాలి కుల సభ్యులు.

**ఆత్మకూర్( ఎం). రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం. ఆత్మకూర్ (ఎం).మండల పరిధిలోని పల్లెర్ల గ్రామంలో చేనేత సహకార సంఘ భవనంలో షోలాపూర్ మున్సిపాలిటీ కార్పోరేషన్ ఎన్నికల్లో గ్రామ పద్మశాలి ముద్దుబిడ్డ గుర్రం సత్యనారాయణ 13 వ,వార్డు కార్పోరేటర్ గా విజయం సాధించిన శుభ సందర్భంగా పల్లెర్ల గ్రామానికి విచ్చేసిన సందర్భంగా పద్మశాలి కుల బంధువులు,బిజెపి గ్రామశాఖ నాయకులు,సర్పంచ్ తండ మంజుల నర్సింహ గౌడ్ దంపతులు,మాజీ సర్పంచ్ నాయిని నర్సింహారెడ్డి,గ్రామ ప్రముఖులు తదితరులు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కార్పోరేటర్ గుర్రం సత్యనారాయణ మాట్లాడుతూ,షోలాపూర్ మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో కార్పోరేటర్ గా నా విజయం కేవలం పదవి లేదా వ్యక్తిత్వ విజయం కాదు అని ఇది నా బాల్య జ్ఞాపకాలకు, నా తల్లిదండ్రుల ఆశీస్సులు, నా కుటుంబ సభ్యుల సహకారం,వార్డు ప్రజలు నాపై ఉంచిన అపారమైన నమ్మకానికి దక్కిన గౌరవం అని అన్నారు.మేము షోలాపూర్ లో స్థిరపడిన మా పూర్వీకుల మూలాలు ఇక్కడే అని మా గుర్రం వారి కుటుంబ సభ్యులు ఇక్కడే వున్నారు. వారిని,కుల బంధువులను కలవడానికి వచ్చానని అన్నారు.పద్మశాలీలు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని కోరారు. పద్మశాలీల కుటుంబాలకు అండగా ఉంటామని అన్నారు.కార్పోరేటర్ గా గెలిచిన నాకు బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం అనంతరం బిజెపి గ్రామశాఖ అభ్యర్థన మేరకు బిజెపి జెండాను ఆవిష్కరించారు.గ్రామంలోని గురుజును,సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని సందర్శించారు.గుర్రం వారి కుటుంబ సభ్యులను మర్యాద పూర్వకంగా కలుసుకొని వారి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తండ మంజుల నర్సింహ గౌడ్,మాజీ సర్పంచ్ నాయిని నర్సింహారెడ్డి,గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు ఏలూరి సుదర్శన్ , పొడుగు భార్గవి సత్యనారాయణ,లోడి మణికాంత్ గౌడ్,ఆంబోజు కృష్ణ,చేనేత నాయకులు ఏలే విశ్వనాథం,పొడుగు వెంకటేష్,గుర్రం నారాయణ,గుర్రం వాసుదేవ్,సాయిని వెంకటేష్,సాయిని అశోక్, ఏలూరి వెంకటేష్,గుర్రం భిక్షపతి,గుర్రం సంతోష్,గుర్రం మల్లేష్,పొడుగు సత్యనారాయణ,గుర్రం సుజాత,గుర్రం సునీత,బిజెపి నాయకులు ఎదుళ్ల మల్లారెడ్డి,గోరిపెల్లి మల్లారెడ్డి,వెంకన్న గౌడ్, రమేష్ గౌడ్,కార్పోరేటర్ సోదరులు గుర్రం లక్ష్మీ నారాయణ,గుర్రం చందు, షోలాపూర్ పద్మశాలి కులబంధువులు,చేనేత నాయకులు,కార్మికులు తదితరులు పాల్గొన్నారు .



### దివ్య ఎంటర్ ప్రైజెస్, ఎం ఆర్ కె హోమ్ ఇంటీ రియర్స్ ప్రారంభోత్సవం

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** మదినగూడలో ప్రసాద్స్ ఫౌండేషన్ సభ్యులు ఎం ఆర్ కే చౌదరి నూతన వ్యాపార సంస్థ దివ్య ఎంటర్ ప్రైజెస్, ఎం ఆర్ కె హోమ్ ఇంటీ రియర్స్ ను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మువ్వ సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ లయన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ పాల్గొని ఎం.ఆర్.కే చౌదరి కి శుభాకాంక్షలు తెలియజేస్తూ అభివృద్ధిలోకి సంస్థ ఎదిగి ఆర్థిక పరంగా పరిపుష్టం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యు. సాంబశివ రావు, వెంకట్రావ్, రావలా శ్రీనివాస్ చౌదరి, శ్రీకాంత్ చౌదరి, పెద్ద బాబు చౌదరి, భాస్కర్, ప్రసన్న, దివ్య, ఎం. జనిత్ చౌదరి, మోక్షిత, సన్మిత తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు సిట్ నోటీసులు
# తీవ్రంగా ఖండిస్తున్నాం

### పటాన్ చెరువు బిఆర్ఎస్ నాయకుల నిరసన

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త నిరసనలలో భాగంగా శాంతియుత నిరసనతో పాటు ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రజల దృష్టిని డైవర్ట్ చేయాలనే ఉద్దేశంతో నోటీసుల పేరుతో ఆడుతున్న డ్రామాగా ప్రజలు గమనిస్తున్నారని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. మీరెన్ని ఇబ్బందులు పెట్టినా, ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని రకాలగా భయభ్రాంతులకు గురి చేసినా, మున్సిపల్ ఎన్నికల్లో ఎగిరేది బిఆర్ఎస్ పార్టీ జెండానే అని నాయకులు తెలిపారు. జై తెలంగాణ జై కేసీఆర్, అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు, పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని రామచంద్రాపురం అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో, పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పై కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణను తీవ్రంగా ఖండిస్తూ శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ పటాన్చెరు ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, తిల్లాపూర్ మాజీ సర్పంచ్ మల్లేపల్లి సోమిరెడ్డి ఆధ్వర్యంలో కూడా ఈ నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, కేసీఆర్ పై జరుగుతున్న విచారణ పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడిని లక్ష్యంగా చేసుకుని, ఆధారంలేని ఆరోపణలతో వేధింపులకు గురి చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని ప్రయత్నిస్తోందని వారు అన్నారు. ఇలాంటి అప్రజాస్వామిక చర్యలను బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ సహించదని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఐలాపూర్ మాణిక్ యాదవ్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తోంట అంజయ్య యాదవ్, సర్కిల్ అధ్యక్షుడు పరమేష్ యాదవ్, పలువురు బీఆర్ఎస్ పార్టీ



నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. నిరసన కార్యక్రమం అనంతరం డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కేసీఆర్ పై కొనసాగుతున్న సిట్ విచారణను తక్షణమే నిలిపివేసి, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాటి సత్యనారాయణ, దేవేంద్ర , నర్సింహ, జంగయ్య యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, జైపాల్, హౌస్, అజీమ్, నరేష్, జాన్సన్, మతిన్, వెంకట్ రెడ్డి, జాకిర్, అప్పల భాస్కర్, కుమార్, నర్సింగ్ రావు, కావలి రాములు తదితరులు పాల్గొన్నారు. రానున్న రోజుల్లో కూడా బీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని నేతలు ఈ సందర్భంగా నేతలు తెలిపారు.

శరీర బరువును అదుపులో ఉంచుకోవడానికి, శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చాలా మంది వాకింగ్ చేస్తూ ఉంటారు. వాకింగ్ వంటి వ్యాయామాలు చేయడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. సాధారణంగా మనం వాకింగ్ చేస్తున్నప్పుడు కాళ్లు, తొడలు, పిరుదులు వంటి భాగాల్లో నొప్పి వస్తూ ఉంటుంది. ఇది అడపాదడపా జరుగుతుంది. కొంత విశ్రాంతి తీసుకున్న తరువాత తగ్గిపోతుంది. కానీ వాకింగ్ చేసేటప్పుడు కాళ్ల నొప్పి ఎక్కువగా ఉండడం, విశ్రాంతి తీసుకున్న తరువాత కూడా తగ్గకపోవడం వంటి లక్షణాలు అధిక కొలెస్ట్రాల్ ను కూడా సూచిస్తాయని వైద్యులు తెలియజేస్తున్నారు. అధిక కొలెస్ట్రాల్ సమస్య ఎక్కువగా ఎటువంటి లక్షణాలు చూపించదు. వాకింగ్ చేసేటప్పుడు మన శరీరం కొన్ని లక్షణాలను చూపిస్తుంది.



# అధిక కొలెస్ట్రాల్ సమస్య ఉందా..?

## ఈ లక్షణాన్ని గమనించండి..!



### కొలెస్ట్రాల్ అడ్డుపడితే..

ధమనుల్లో కొలెస్ట్రాల్ అడ్డుపడడం వల్ల నడిచిన ప్రతిసారి నొప్పితో పాటు వింత అనుభూతి కలుగుతుంది. ధమనుల్లో కొలెస్ట్రాల్ అడ్డుగా ఉండడం వల్ల నడిచేటప్పుడు ఆక్సిజన్ ఉన్న రక్తం సరిగ్గా సరఫరా అవ్వదు. దీంతో నడిచేటప్పుడు నొప్పితో పాటు కాళ్లు బరువుగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మెట్లు ఎక్కడం కూడా కష్టంగా అనిపిస్తుంది. ఈ సమస్యను నిర్లక్ష్యం చేయడం వల్ల కాలక్రమేణా రక్తప్రసరణ బలహీనపడుతుంది. కండరాలు కుచించుకుపోతాయి. కొంతకాలానికి నడవడం, నిలబడడం కూడా కష్టతరంగా మారుతుంది. అంతేకాకుండా నడిచిన తరువాత ఒక కాలు చల్లగా మరో కాలు వేడిగా ఉండడం వంటి లక్షణాలు కూడా ధమనుల్లో అధిక కొలెస్ట్రాల్ ను సూచిస్తాయి. రక్తం వెచ్చగా ఉంటుంది. రక్తప్రసరణ సరిగ్గా జరగకపోవడం వల్ల కాలు తగినంత వేడెక్కక చల్లగా ఉంటుంది. నడిచిన తరువాత కాలు చల్లగా ఉండడం, కాలు రంగు మారడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు.



### కాళ్లల్లో తిమ్మిర్లు, గుచ్చినట్లుగా ఉండడం..

అలాగే నడిచేటప్పుడు కాళ్లు తిమ్మిర్లు రావడం, గుచ్చినట్టుగా ఉండడం కూడా ఒక సంకేతమే. నడిచేటప్పుడు నరాలకు ఆక్సిజన్ తో కూడిన రక్తం నిరంతరం సరఫరా అవ్వాలి. ధమనుల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వల్ల రక్తం సరఫరా అవ్వక నరాల పనితీరు దెబ్బతింటుంది. దీంతో పాదాల్లో తిమ్మిర్లు, మంట, స్పర్శ కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ సమస్యను నిర్లక్ష్యం చేసేకొద్దీ పాదాలపై అల్సర్లు, ఇన్ఫెక్షన్లు, పాదాలపై నెమ్మదిగా గాయాలు అయ్యే ప్రమాదం కూడా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### పాదాల రంగు మారడం..

అలాగే అధిక కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడే వారిలో నడిచిన తరువాత పాదాల రంగు మారుతుంది. చర్మం పాలిపోయినట్టు కనబడడం, నీలి లేదా ఊదా రంగులో కనబడడం వంటి లక్షణాలు అధిక కొలెస్ట్రాల్ ను సూచిస్తాయి. ధమనుల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వల్ల చర్మ కణజాలానికి ఆక్సిజన్ సరఫరా తగ్గడం వల్ల ఇలా జరుగుతుంది. సమస్య పెరిగే కొద్దీ కాళ్లపై వెంట్రుకలు ఊడిపోవడం, కాలి వేళ్లపై, పాదాలపై నయం కాని పుండ్లు పడడం కూడా జరుగుతుంది. కనుక నడిచే సమయంలో ఇటువంటి లక్షణాలను గమనించిన వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. అధిక కొలెస్ట్రాల్ సమస్య గుండె జబ్బులకు, స్ట్రోక్ వంటి సమస్యలకు దారి తీస్తుంది. కనుక అధిక కొలెస్ట్రాల్ సమస్యను అస్సలు నిర్లక్ష్యం చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారు.



అండర్-19 వన్డే ప్రపంచకప్

# పాక్‌పై యువ భారత్ ఘనవిజయం




## సెమీస్‌కు భారత్

**బులవాయో:** అండర్-19 ప్రపంచ కప్ 2026లో భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. సూపర్ సిక్సెస్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 58 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 253 పరుగుల లక్ష్యఛేదనలో పాక్.. 46.2 ఓవర్లలో 194 పరుగులకే ఆలౌటైంది. ఉస్మాన్ ఖాన్ (66), హంజా జహూర్ (42), ఫర్హాన్ యూసఫ్ (38) పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు తక్కువ స్కోరుకే పరిమితమయ్యారు. భారత బౌలర్లలో ఖిలాన్ పటేల్ 3, ఆయుష్ మాత్రే 3, అంబరీష్, హెనిల్ పటేల్, కనిష్క్ చౌహాన్, విహాన్ మల్హోత్రా తలో వికెట్ పడగొట్టారు. ఫిబ్రవరి 3న తొలి సెమీస్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్.. ఫిబ్రవరి 4న రెండో సెమీ ఫైనల్‌లో భారత్, అఫ్గానిస్థాన్ తలపడనున్నాయి. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. 49.5 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటైంది. 47 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన టీమ్ఇండియాను వేదాంత్ త్రివేది (68; 98 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) కీలకమైన ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. వైభవ్ సూర్యవంశీ (30; 22 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. కెప్టెన్ ఆయుష్ మాత్రే పరుగుల ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు.

ఆర్.ఎస్.అంబరీష్ (29), విహాన్ మల్హోత్రా (21), అభిజ్ఞాన్ కుందు (16), ఆరోన్ జార్జ్ (16) పరుగులు చేశారు. చివర్లో కనిష్క్ చౌహాన్ (35; 29 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), ఖిలాన్ పటేల్ (21; 15 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడటంతో భారత్ మంచి స్కోరే సాధించింది. పాక్ బౌలర్లలో అబ్దుల్ సుభాన్ 3, మహ్మద్ సయ్యమ్ 2, అహ్మద్ హుస్సేన్, మోమిన్, అలీ రజా, అలీ హసన్ తలో వికెట్ పడగొట్టారు.




## టీ20 ప్రపంచ కప్‌నకు దూరం..

### బంగ్లాదేశ్‌లో కొత్త టోర్నమెంట్

టీ20 ప్రపంచ కప్ 2026కు దూరమైన బంగ్లాదేశ్ తమ దేశ ఆటగాళ్ల కోసం కొత్త టీ20 టోర్నమెంట్‌ను ప్రారంభించనుంది. దీనికి ఓడోమ్మో బంగ్లాదేశ్ ు20 కప్ 2026 అని పేరు పెట్టింది. 'ఓడోమ్మో' అంటే బంగ్లాలో అజేయమైన లేదా ఎవరికీ లొంగనిది అని అర్థం. ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు ఈ టోర్నీ జరగనుంది. మూడు జట్లు పోటీపడతాయి. ప్రైజ్‌మనీ, ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులకు రూ.1.87 కోట్లు ఖర్చు చేస్తామని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధికారి తెలిపారు. మ్యాచ్‌లకు మరింత ఊపు తీసుకొచ్చేందుకు 'ఇంపాక్ట్ ప్లేయర్ రూల్'ను ఈ టోర్నీలో ప్రవేశపెట్టనున్నారు. ఫిబ్రవరి 5, 6, 7 తేదీల్లో గ్రూప్ దశ మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ నెల 9న ఫైనల్ నిర్వహిస్తారు. టీ20 ప్రపంచ కప్ 2026 ఈ నెల 7 నుంచి ప్రారంభంకానుంది. ఈ మెగా టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. భారత్‌లో మ్యాచ్‌లు ఆడటానికి బంగ్లాదేశ్ నిరాకరించింది. దీంతో ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ప్రత్యామ్నాయ జట్టుగా ఆడించాలని ఐసీసీ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కొత్త టోర్నమెంట్‌ను ప్రారంభించాలని నిర్ణయించింది.

## భారత్‌తో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నాం: పాక్






టీ20 ప్రపంచ కప్ 2026లో భారత్‌తో మ్యాచ్ ఆడే విషయంలో పాకిస్థాన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టీమ్ఇండియాతో మ్యాచ్‌ను బహిష్కరించాలని నిర్ణయం తీసుకుంది. అయితే, టోర్నీలో మిగతా మ్యాచ్‌లను మాత్రం ఆడతామని తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 15న కొలంబోలో భారత్, పాక్ మ్యాచ్ జరగాల్సి ఉంది. ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభంకానున్న టీ20 ప్రపంచ కప్‌నకు భారత్, శ్రీలంక ఆతిథ్యమివ్వనున్నాయి. పాకిస్థాన్ మ్యాచ్‌లు కొలంబోలో షెడ్యూల్ చేసిన విషయం తెలిసిందే. పొట్టి కప్‌లో ఆడేందుకు ఇప్పటికే పాక్ తన జట్టును ప్రకటించింది.

## ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా అల్కరాస్



**మెల్‌బోర్న్:** పురుషుల టెన్నిస్‌లో కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేసిన అతిపిన్నవయస్కుడిగా ప్రపంచ నంబర్ వన్ అల్కరాస్ (స్పెయిన్) చరిత్ర సృష్టించాడు. ఆదివారం హోరాహోరీగా సాగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో నొవాక్ జకోవిచ్ (సెర్బియా)పై 2-6, 6-2, 6-3, 7-5 తేడాతో అల్కరాస్ విజయం సాధించాడు. 22 ఏళ్ల అల్కరాస్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఇది తొలి టైటిల్. అతను ఇప్పటికే ఫ్రెంచ్ ఓపెన్ (2024, 2025), వింబుల్డన్ (2023, 2024), యూఎస్ ఓపెన్ (2022, 2025) టైటిళ్లు సాధించాడు. మరోవైపు.. జకోవిచ్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌లో ఇది తొలి ఓటమి. అంతకుముందు ఈ టోర్నమెంట్‌లో ఫైనల్ చేరిన పదిసార్లూ అతడు విజేతగా నిలవడం విశేషం. టెన్నిస్ చరిత్రలో అత్యధిక (25) గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లు సాధించాలనుకున్న జకోవిచ్ ఆశలపై అల్కరాస్ నీళ్లుచల్లాడు. ప్రస్తుతం 24 టైటిళ్లతో ఉన్న నొవాక్.. 25వ టైటిల్ కోసం చాలా కష్టపడుతున్నాడు. చివరగా 2023లో యూఎస్ ఓపెన్ గెలిచాక.. అతడు మళ్లీ గ్రాండ్‌స్లామ్ కొట్టలేకపోతున్నాడు.

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం · తెలుగు దిన పత్రిక




# శారీలో ఎలిగెంట్‌గా నభా నటేష్

'నన్ను దోచుకుందువటే' మూవీతో టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయిన నభా నటేష్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. ఆ తర్వాత 'అదుగో' అనే సినిమాలో నటించింది. కానీ ఈ చిత్రం అంతగా విజయం సాధించలేకపోయింది. ఆ తర్వాత ఎనర్జిటిక్ స్టార్ రామ్ నటించిన 'ఇస్మార్ట్ శంకర్' మూవీతో ఫుల్ ఫామ్‌లోకి వచ్చింది. దీంతో ఈ చిన్నదానికి వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా 'డిస్కో రాజా', 'సోలో బ్రతుకే సో బెటర్', డార్లింగ్ వంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. ప్రస్తుతం నిఖిల్ సరసన 'స్వయంభు' మూవీతో పాటు నాగబంధం సినిమాలో నటిస్తోంది. అలాగే సోషల్ మీడియాలో ఫుల్ యాక్టీవ్‌గా ఉంటూ తన అందచందాలతో కుర్రకారుకు అందాల విందును వడ్డిస్తుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా నభా నటేష్ తన ఇన్‌స్టా వేదికగా కొన్ని ఫొటోలు షేర్ చేసింది. తాజాగా నభా తన ఇన్‌స్టాలో కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో నడుము పార్ట్స్‌తో పాటు బ్రెస్ట్ పార్ట్స్ కనిపించేలా బోల్డ్ షో చేసింది. చాలా సింపుల్ శారీలో చాలా ఎలిగెంట్‌గా కనిపించింది. హెయిర్ లీవ్ చేసుకుని చాలా నేచురల్ బ్యూటీలా కవ్వించింది. ఇక వాటికి.. 'జంట' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. ఇక వీటిని చూసిన నెటిజన్లు ఉఫ్.. ఊపిరాగిపోతోంది అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# చాలా బిజీగా జీవిస్తున్నాను

: రాశీ ఖన్నా

యంగ్ హీరోయిన్ రాశీ ఖన్నా ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు సంపాదించుకున్నది. ఇటీవల ఈ చిన్నది స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ సరసన 'తెలుసు కదా' మూవీలో నటించి మెప్పించింది. థియేటర్లలో రిలీజ్ అయిన ఈ చిత్రం ఓకే ఓకే అనిపించుకున్నప్పటికీ ఈ భామ యాక్టింగ్‌కు మాత్రం ఫుల్ మార్కులే పడ్డాయి. ప్రస్తుతం ఈ బ్యూటీ తెలుగులో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన 'ఉస్తాద్ భగత్ సింగ్' మూవీలో నటిస్తోంది. దీనికి హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. అయితే ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోన్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఇదిలా ఉంటే.. నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది ఈ ముద్దుగుమ్మ. ఈ క్రమంలో తాజాగా రాశీ పోస్ట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. 'నేను చాలా బిజీగా జీవిస్తున్నాను' అంటూ షూటింగ్, జిమ్‌లో కష్టపడుతున్న ఫొటో, డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తున్న వీడియో, మేకప్ వేసుకుంటూ ఫోన్‌లో మాట్లాడుతున్న ఫొటోలను షేర్ చేసింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. మరి దీన్ని చూసిన పవర్ స్టార్ ఫ్యాన్స్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా అప్డేట్ కావాలంటూ కామెంట్స్ చేస్తున్నారు.



# మేడమ్ సార్ మేడమ్ అంతే..

తన ఫస్ట్ సినిమాతోనే బేబమ్మగా తెలుగు ఆడియన్స్ మదిలో నిలిచిపోయింది కృతి శెట్టి. దీంతో ఈ క్యూట్ హీరోయిన్‌కు వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అయితే ఈ ముద్దుగుమ్మ రీసెంట్‌గా స్టార్ హీరో కార్తి నటించిన 'వా వాతియార్' మూవీతో మన ముందుకు వచ్చింది. నలన్ కుమార స్వామి దర్శకత్వం వహించిన ఈ సినిమాను స్టూడియో గ్రీన్ బ్యానర్ పై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. అయితే థియేటర్లలో రిలీజ్ అయిన ఈ చిత్రం పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. ఇదిలా ఉంటే.. ఈ భామ సోషల్ మీడియాలో చేసే రచ్చ మామూలుగా ఉండదు. నిత్యం స్టైలిష్ వేర్ డ్రెస్సులతో కుర్రకారును ఫిదా చేస్తూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా కృతి శెట్టి తన ఇన్‌స్టా అకౌంట్‌లో కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో లెహంగాలో యద అందాలు కనిపించేలా హాట్ షో చేసింది. నడుమందాలతో మత్తెక్కిచ్చింది. వావ్ అనిపించే అందంతో యూత్‌ను ఆకట్టుకుంటుంది. దీంతో ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారాయి. ఇక వాటిని చూసిన నెటిజన్లు మేడమ్ సార్ మేడమ్ అంతే అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com